క్లుప్తంగా

మురికి కాల్వ బాగుచేయండి



పూడుకుపోయిన మురికి కాల్వ

కోరుట్ల: పట్టణంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ షాపింగ్ మాల్ సమీపంలో మురికి కాల్వ పూడ్చి నిర్మాణం జరగడంతో కాల్వ నీరు నిలిచి దుర్గంధం వస్తుందని శనివారం ఇన్‌చార్జీ మున్సిపల్ కమిషనర్ అభినయ్‌కు హాజీపురా కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిలిచిన మురికి నీటితో కంపు వాసన వచ్చి దోమలు పెరిగిపోయి జనాలు రోగాల బారిన పడుతున్నారని ఆరోపించారు. వెంటనే మురికి కాల్వను సరిచేసి ఇబ్బందులు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో హాజీపురా కాలనీవాసులు హమీద్, ముక్రంబేగ్, తజ్మల్, అషు, షోయబ్, పర్వాన్, సజ్జిత్, అద్నాన్, యూజెస్, అసీం, అబ్బులు ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అధికారులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, పెగ్గెర్ల, దుంపేట గ్రామాల్లో శనివారం పారిశుధ్య పనులను ఎంపీడీవో జనార్దన్, ఏపీవో రాజేందర్ పరిశీలించారు. మురికికాలువల్లో చెత్తను, రోడ్డు పక్కన ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఆయా వాడల్లో వర్షాల వల్ల రోడ్లపై నీళ్లు నిల్వ లేకుండా చదును చేయించాలన్నారు. వారి వెంట సర్పంచులు కూన సులోచన, ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి ఎం.డీ గఫూర్, గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, బద్దం మహేందర్‌రెడ్డి, రాజేశం ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయికల్: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ తెలిపారు. శనివారం పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా వీరాపూర్‌రోడ్‌లో పారిశుధ్య సిబ్బందితో మురికికాలువల్లో చెత్తాచెదారం తీయించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయానికి గ్రామస్తుల విరాళం



విరాళం అందిస్తున్న గ్రామస్తులు

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణం కోసం పాతదాంరాజుపల్లి గ్రామస్తులు శనివారం రూ.31,116 విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులను సన్మానించి, వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బద్దం శ్రీనివాస్‌రెడ్డి, సురకంటి కమలాకర్, గజ్జి రాజరెడ్డి, గడ్డం నరేశ్, నేవూరి శ్రీధర్, బద్దం చందు, మరిపెల్లి నర్సయ్య, సంతోశ్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షహర్ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న చైర్మన్ మోర హన్మండ్లు

రాయికల్: పట్టణంలో మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇంట్లోని పాతబట్టలు, పాత పుస్తకాలు, పేపర్లు నిరుపయోగంగా ఉన్నట్లయితే మున్సిపల్ సిబ్బందికి అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ సంతోష్‌కుమార్, కౌన్సిలర్ మ్యాకల కాంతారావు, జేఏ రజాక్, అశ్విని, ప్రత్యూష, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మ రక్షణ.. కరాటే శిక్షణ

- 23 ఏళ్లుగా ఉచిత శిక్షణ ఇస్తున్న అల్లె రమేశ్
- 6 వేల మందికి శిక్షణ
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థుల రాణింపు
- 42 మందికి బ్లాక్ బెల్టులు ప్రదానం



కోరుట్లలో కరాటే శిక్షణ



రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పతకాలతో పెద్దలు, చిన్నారులు



కోరుట్లటౌన్: పట్టణానికి చెందిన అల్లె రమేశ్ 23 ఏళ్లుగా విద్యార్థులకు ఉచిత కరాటే శిక్షణ అందిస్తున్నారు. సుమారు 6 వేల మంది విద్యార్థులు కరాటే నేర్చుకున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించి రమేశ్‌కు గుర్తింపు తీసుకవచ్చారు.ఎంతోమందికి శిక్షణ ఇస్తున్న రమేశ్ రాష్ట్ర స్థాయి జయశంకర్ అవార్డు, నేషనల్ బ్రూస్‌లీ అవార్డు, నేషనల్ నంది అవార్డులు అందుకున్నారు.

బాల్యం – విద్యాభ్యాసం

- కోరుట్ల పట్టణంలో అల్లె రమేశ్ చిన్నప్పుడు ప్రాథమిక విద్య ప్రభుత్వ పాఠశాలలో పూర్తి చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా భీవండీ, ముంబాయి ప్రాంతాల్లో కొంత కాలం ఉపాధి కోసం పని చేశారు. 1993లో కోరుట్లకు వచ్చి ఇల్లుటపు నర్సయ్య, కరీంనగర్‌లో వసంత్ కుమార్ వద్ద కరాటే శిక్షణ, మెలుకువలు నేర్చుకున్నారు. 2000 సంవత్సరంలో ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ సంస్థ కోరుట్లలో స్థాపించారు. అప్పటి నుంచి 23 ఏళ్లుగా కోరుట్ల ప్రాంతంలో కరాటే శిక్షణను అందిస్తున్నాడు

వేసవిలో ఉచిత శిక్షణ

- ప్రతి ఏటా వేసవిలో ఉచిత కరాటే శిక్షణతో విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం పట్టణంలోని కల్లూర్ రోడ్ గడి స్కూల్ ప్రాంగణం, ఆర్డీవో కార్యాలయం ఆవరణలో కరాటే శిక్షణ తరగతులు ఉచితంగా నేర్పుతున్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ –2018

- ఉమ్మడి జిల్లా స్థాయి స్థానిక ఫంక్షన్ హాలులో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్, అల్లె రమేష్ ఆధ్వర్యంలో 3 రోజులు పాటు కరాటే పోటీలు జరిగాయి. మొదటిసారి కోరుట్లను ఎంపిక చేసి పోటీలు నిర్వహించడంతో రాష్ట్ర స్థాయి ఖ్యాతి కోరుట్ల ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్‌కు దక్కింది. కోరుట్ల, కథలాపూర్ పరిసరాల్లో కరాటే శిక్షణకు మంచి ఆదరణ లభించింది.

మిషన్ సాహసి ప్రోగ్రాం –2020

- ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో మిషన్ సాహసి ప్రోగ్రాలో భాగంగా కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ , ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుకుంటున్న బాలికలకు, మహిళలకు కరాటే, సెల్ఫ్ డిఫెన్ కోర్సులు నేర్పించారు. ఇటీవల తెలంగాణ జ్యోతిరావు పూలే పాఠశాలల్లో కరాటే ట్రైనింగ్ క్యాంపు, 2 నెలలు విద్యార్థినులకు ప్రత్యేక బ్యాచ్‌లు ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చారు. రమేశ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 42 మంది విద్యార్థులు బ్లాక్ బెల్టులు సాధించడం విశేషం. వివిధ స్థాయి కరాటే పోటీల్లో 5 వేల బంగారు, వెండి, కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించారు. ప్రముఖ సినీ నటుడు సుమన్, కరాటే చీఫ్ ఎగ్జామినర్ వసంత్‌కుమార్ చేతుల మీదుగా అల్లె రమేశ్‌తో పాటు ప్రతిభ చాటిన విద్యార్థులు పథకాలు, ప్రశంసా పత్రాలు, సన్మానం అందుకున్నారు.

కరాటే అంతర్జాతీయ పోటీలు–2021

- 2021లో కరీంనగర్ ఓ గార్డెన్‌లో మొదటి తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అకాడమీ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కరాటే సంయుక్త నిర్వహణలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కోరుట్ల ఒకినావా స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి, పతకాలు గెలుచుకున్నారు. హైదరాబాద్‌లో 2021– అంతర్జాతీయ కరాటే పోటీల్లో కోరుట్ల ఒకినావా స్కూల్ విద్యార్థులు 10 మంది అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి పతకాలు సాధించారు.

కరాటేకు గుర్తింపు చాలా సంతోషం



ఒలంపిక్ సంఘం, క్రీడా శాఖలు స్పోర్ట్స్‌లో కరాటే క్రీడాకారులకు గుర్తింపు ఇవ్వడం సంతోషంగా ఉంది. తెలంగాణ క్రీడాకారులు కరాటే పోటీల్లో అంతర్జాతీ యంగా ప్రతిభ చాటేందుకు అవకాశాలు పెరిగాయి. ప్రభుత్వం, తల్లిదండ్రులు కరాటేను ఆదరించడం ఆనందంగా ఉంది.

– అల్లె రమేశ్, కరాటే కోచ్, కోరుట్ల

అధిక తూకంతో మోసం చేస్తున్నారు..



ధాన్యం పరిశీలిస్తున్న జువ్వాడి కృష్ణారావు

ఇబ్రహీంపట్నం: కొనుగోలు కేంద్రాల్లో తాలు తప్ప పేరుతో క్వింటాలుకు 5 కిలోలు అధిక తూకం వేసి రైతులను మోసగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని అమ్మక్కపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని, రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం పోసి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తరుగు పేరుతో అధిక తూకం వేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజేశ్వర్ తల్లి ఇటీవల మరణించగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమిరెడ్డి లింగారెడ్డి, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు అందె మారుతి, నాయకులు బాపుజీ, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చెన్నూరి శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీధర్ తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ నాలుగు కోర్సులు ఉన్నాయని, ఒక్కో గ్రూపులో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: నిరుపేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటకు చెందిన ఎస్.లావణ్యకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును, జి.సుగుణకు మంజూరైన రూ.12 వేల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా వైద్యం చేయించుకుంటే ప్రభుత్వం సీఎం రిలీఫ్‌ఫండ్‌నుంచి ఆర్థికసాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి, నాయకులు సమిండ్ల శ్రీనివాస్, తోట మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వీఆర్‌ఏల సన్మానం

దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం జీతాలు ఇస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలోని వీఆర్‌ఏల సంఘం సభ్యులు శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను సన్మానించారు.వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయడం, వివిధ ప్రభుత్వ విభాగాల్లో సర్దుబాటు చేయడంపై హర్షం వ్యక్తం చేసి సన్మానించారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు వకీల్, మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు శంకర్, మంచాల మహేశ్, సుధాకర్,వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లిలో విశ్వబ్రాహ్మణ సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దొంతి నాగరాజు తెలిపారు.కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, శేఖర్, మధు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట

జగిత్యాల: సీఎం కేసీఆర్ బీసీలకు పెద్దపీట వేస్తున్నారని, అన్ని వర్గాలకు అండగా ఉంటూ పేదలను ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీసీలకు ఆర్థికసాయం చేస్తామేని సీఎం ప్రకటించడంతో శనివారం ఎమ్మెల్యేను బీసీ సంఘం నాయకులు కలిసి సత్కరించారు. కార్యక్రమంలో గాజుల నాగరాజు, సమిండ్ల శ్రీనివాస్, తోట మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

పట్టణంలోని 16వ వార్డుకు చెందిన తుమ్మనపల్లి రమేశ్ కాలు ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం సహాయనిధి ద్వారా రూ.1.50 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. 28వ వార్డుకు చెందిన నదీంఖాన్ మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా రూ.2.50 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు క్యాదాసు నవీన్, రాజ్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

టీపీవైఎస్ మండలాధ్యక్షుడిగా దీపక్

కథలాపూర్: తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం బీమారం మండలాధ్యక్షుడిగా వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బంగార్ దీపక్ నియమితులయ్యారు. శనివారం బీమారంలో మండల సంఘం సభ్యులు సమావేశమై నూతన కమిటీని నియమించారు. ఉపాధ్యక్షుడిగా నల్ల గణేశ్, ప్రధానకార్యదర్శిగా మ్యాదరి శేఖర్, కార్యదర్శులుగా దాసరి అరవింద్, అరికెల తిరుమల్, ప్రచార కార్యదర్శిగా ఎర్ర అరుణ్ నియమితులయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొంగర పవన్, నాయకులు రఘు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశం నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మల్లాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసిన యాదవ సంఘం సభ్యులపై చర్యలు తీసుకోవాలని శనివారం జిల్లా పంచాయతీ అధికారికి రేగుంటకి చెందిన బండారి వెంకటేశ్ ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలను రాజకీయాలకు, కులసంఘాల సమావేశాలకు వేదికగా వాడుకుంటున్న సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల సంఘం సమావేశం నిర్వహించుకున్న అధికారులు అడ్డుకోకపోవడంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

వెల్గటూర్: వీఆర్‌ఏల ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మండల వీఆర్‌ఏలు తహసీల్దార్ ఆఫీస్ ఎదుట సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు కండ్లె నారాయణ, ఉపాధ్యక్షుడు ఎస్.కె. అంకూస్, తరాళ్ల అశోక్, తరాళ్ల శ్రీనివాస్,కొప్పుల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి సారంగాపూర్ మండల వీఆర్‌ఏలు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల కలను సాకారం చేసిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- డీఎస్పీ రవీందర్‌రెడ్డి



సీజ్ చేసిన వాహనాలు పరిశీలిస్తున్న డీఎస్పీ

మెట్‌పల్లి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శాంతినగర్‌లో శనివారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. వాహనాలను పరిశీలించి సరైన పత్రాలు లేని 97 ద్విచక్ర వాహనాలు, 10 ఆటోలను సీజ్ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ గంజాయితో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలనీలో అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారమందించాలని సూచించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి, కోరుట్ల సీఐలు లక్ష్మీనారాయణ, ప్రవీణ్, ఎస్సైలు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ సెంటర్లు ఏర్పాటు

జగిత్యాల: పట్టణంలో ఇంట్లో పనికిరాని దుస్తులు, వస్తువులు, ప్లాస్టిక్ స్రాప్ మొదలైనవి రెడ్యూస్ రీయూస్ రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్లలో అందజేయవచ్చని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని 11వ వార్డులో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనికిరాని వస్తువులను పడేయకుండా ఈ సెంటర్లలో అందజేయాలని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. అన్ని కూడళ్లలో సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ రాజేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలె ఎల్లం పాల్గొన్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ ఆధ్వర్యంలో కమిషనర్ రమేశ్ రెడ్యూస్ రీయూస్ రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) కార్యక్రమాన్ని చేపట్టారు. ఇళ్లల్లో వాడుకున్న పాత వస్తువులు బట్టలు, పుస్తకాలు,పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులు, దస్తులు తదితర వాటిని సేకరించి సెంటర్లో ఉంచారు. అంతకముందు 12, 13 వార్డుల్లో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు అరుణ, బండారి అశోక్ తదితరులున్నారు.

రైతుల బంద్‌కు టీజేఎస్ మద్దతు

మెట్‌పల్లి: ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను నిరసిస్తూ సోమవారం రైతులు నిర్వహిస్తున్న జిల్లా బంద్‌కు తెలంగాణ జన సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు కంతి మోహన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరి కారణంగా రైతులు బంద్ నిర్వహించడం దురదృష్టకరమన్నారు. మిల్లర్ల పేరుతో అధికార పార్టీ ఎమ్మెల్యేలే రైతులను దగా చేస్తున్నారని విమర్శించారు. బంద్‌కు అన్ని వర్గాలు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు. అలాగే రైతు బంద్‌కు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

ధర్మపురి: రైతులకు కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఏడీఏ రాంచంద్రం హెచ్చరించారు. ధర్మపురి శివారులోని నర్సయ్యపల్లె రైతు వేదికలో శనివారం మండంలోని అగ్రి డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే వానకాలం సీజన్లో రైతులకు కావాల్సిన నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా విక్రయ రశీదు ఇవ్వాలని, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, మండల ఏవో చంద్రదీపక్, జైనా పీఏసీఎస్ చైర్మన్ నరేశ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు భీమన్న, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలందించాలి

రాయికల్: నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అన్నారు. మండలంలోని ఒడ్డెలింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆరోగ్య సమితి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో అభివృద్ధి, వైద్యసేవలపై చర్చించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కస్తూరి సతీశ్, ఎంపీడీవో సంతోష్‌కుమార్,తహసీల్దార్ ఖయ్యూం, సర్పంచ్ పాలకుర్తి రవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ల్యాబ్ టెక్నీషియన్ రంజిత్ పాల్గొన్నారు.

పెగడపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ శోభ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి నరేశ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జన ఆరోగ్య సమితి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒకరు భాగస్వాములు కావాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఉప కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా సేవలందించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, జయశీల, సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: గ్రామాల్లో ప్రభుత్వ వైద్యసేవలను విస్తృత పరచాలని ఎంపీపీ జవ్వాజి రేవతి అన్నారు. మండలంలోని అంబారిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం జన ఆరోగ్య సమితి కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీతోపాటు ఆరోగ్య ఉపకేంద్రాల్లో ప్రజలకు మంచి వైద్యం అందించాలన్నారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వైద్యసిబ్బంది వివరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అర్చన, హెచ్‌ఈవో రామ్మోహన్, సర్పంచ్ గోపు శ్రీనివాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి: ప్రభుత్వం మంజూరు చేసిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎం.ఎల్.హెచ్.పీ సౌమ్య తెలిపారు. బుగ్గారం మండలంలోని వెల్గొండలో నూతనంగా మంజూరైన హెల్త్ వెల్నెస్ సెంటర్‌కు సౌమ్య బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా శనివారం గ్రామంలో జన సమితి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ గాదె తిరుపతి, కార్యదర్శి శైలజ, జె సుగుణ తదితరులున్నారు.

తడి,పొడి చెత్త సేకరణకు మహిళా సంఘ సభ్యులు సహకరించాలి

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో తడి, పొడి చెత్త సేకరణకు మహిళా సంఘ సభ్యులు సహకరించాలని ఎంపీవో కృపాకర్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వాడ వాడలో తడి, పొడి చెత్తను వేరు వేరు చేసి ఇంటి యాజమానులు గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో వేసే విధంగా 10 ఇళ్లకు ఒకరు చొప్పున మహిళా సంఘ సభ్యులు వలంటీర్లుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, సీసీ సురేఖ, పంచాయతీ కార్యదర్శి నారాయణ, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

కోరుట్ల: పట్టణంలోని సాయిరాం కాలనీలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహ సహిత ధ్వజ స్తంభ ప్రతిష్ఠా కార్యక్రామాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విగ్రహాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అర్చకులు , ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రత్నాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్‌లో సంగం నర్సింగ్‌హోం ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ మేడి అనూష, వైద్యుడు రాంచందర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించడం సామాజిక బాధ్యతగా అభివర్ణించారు. సర్పంచ్ అనూష మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి, మందులు పంపిణీ చేసిన వైద్యుడు రాంచందర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, జీపీ కార్యదర్శి శ్రీధర్, నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ లక్కీ డ్రా మోసంపై ఫిర్యాదు

కథలాపూర్: లక్కీ డ్రాలో సభ్యులుగా చేరితే బైక్ ఇస్తామని చెప్పి మోసం చేశారని పలువురు బాధితులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. ఒక్కో సభ్యుడు నెలకు రూ. 2,600 చెల్లిస్తే నెలవారీ డ్రాలో విజేతలను ఎంపిక చేస్తామని చెప్పడంతో పలువురు బాధితులు 27 నెలల పాటు డబ్బులు చెల్లించామని, తర్వాత బైక్ ఇవ్వలేదన్నారు. వారంరోజులుగా బైక్ షోరూం మూసి ఉండటంతో బాధితులు శంకర్, విక్రమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు ఏడాది జైలు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని నల్లగుట్ట ప్రాంతానికి చెందిన వేముల పద్మ అనే మహిళ బైండోవర్ ఉల్లంఘించినందుకు తహసీల్దార్ మధు ఏడాది జైలు శిక్ష విధించారు. పద్మ గతంలో నాటు సారా అమ్ముతుండగా పట్టుకుని ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. నాటుసారాతో మళ్లీ పట్టుబడగా కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా, రూ.1లక్ష జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోవడంతో జైలు శిక్ష విధించారు. ఎక్సైజ్ సీఐ నరేశ్ రెడ్డి, ఎస్సై సరిత, పద్మను కరీంనగర్ జైలుకు తరలించారు.